సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 27 । జనవరి । 2023



కాలిన విద్యుత్ వైర్
చెత్తకు అంటుకున్న మంటల వేడితో విద్యుత్ వైర్లు కాలిపోగా.. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 8లో



మాట మార్చిన బీజేపీ
నల్లచట్టాల రద్దుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాట మార్చిందని వామపక్ష రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. 10లో

గరిష్టం / కనిష్టం
33°/ 17°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. ఉదయం, సాయంత్రం మాత్రం చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి టీచర్ల బదిలీలు, పదోన్నతులు



ఉపాధ్యాయుల ఎస్‌ఆర్‌లను పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించడమే కాక బదిలీలు చేపట్టనున్నట్లు తాజాగా ప్రకటించింది. ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేయగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక శుక్రవారం నుంచి షెడ్యూల్ ప్రకారం బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ మొదలుకానుంది. కాగా, జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్ల(ఎస్‌ఏ)ల్లో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతికి అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ఈమేరకు వీరి సర్వీస్ రిజిస్టర్ల(ఎస్‌ఆర్)ను జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ నేతృత్వాన గురువారం పరిశీలించారు. పరిశీలన కోసం పది బృందాలను ఏర్పాటు చేయగా... సుమారు 400మంది ఉపాధ్యాయులు పరిశీలనకు హాజరయ్యారు. కాగా, ఇప్పటికే డీఈఓ కార్యాలయాన్ని నూతన కలెక్టరేట్‌కు మార్చినప్పటికీ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ మాత్రం పాత డీఈఓ కార్యాలయంలోనే జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఖమ్మం చేరుకోనున్న పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు. ఆతర్వాత మధ్యాహ్నం 3.30 గంటలకు చింతకాని మండలం పాతర్లపాడులో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఖమ్మం చేరుకుని స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

జిల్లాకు 33 మంది ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: 317 జీఓతో పక్క జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయుల్లో 33 తిరిగి జిల్లాకు కేటాయించారు. స్పౌజ్ కేటగిరీ కింద వీరు చేసుకున్న దరఖాస్తులను ప్రభుత్వం ఆమోదించింది. ఈమేరకు 33మందిని అక్కడి అధికారులు రిలీవ్ చేయగా, శుక్రవారం వారు జిల్లాలో విధుల్లో చేరనున్నారు.

లక్ష్యం.. ప్రగతిపథం





జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అదనపు డీసీపీ శబరీష్



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు, హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- జిల్లాలో 15 లక్షల మందికి కంటి పరీక్షలు
- మెడికల్ కాలేజీతో అందుబాటులోకి ఆధునిక వైద్యం
- 'మన ఊరు-మన బడి'లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో జిల్లా
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాను ప్రగతి పథంలో నడపడమే లక్ష్యం. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో జిల్లా పురోగమిస్తోంది. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించి అన్ని రంగాల్లో జిల్లా అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నాం... అని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఫలితంగానే భారత్ గణతంత్ర దేశంగా అవతరించిందని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాలను త్యాగం చేసిన అమరులు, రాజ్యాంగ రూపకర్తలకు జోహార్లు అర్పిస్తున్నట్లు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయ (కలెక్టరేట్)లో కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో సాధించిన ప్రగతిని వివరించారు. కలెక్టర్ ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే...

15 లక్షల మందికి కంటి పరీక్షలు

రెండో విడత కంటివెలుగు కోసం జిల్లాలో 55 కంటి వెలుగు బృందాలను ఏర్పాటు చేసి.. అర్హులైన 15,81,782 మందికి స్క్రీనింగ్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇప్పటి వరకు 38,418 మందికి పరీక్షలు చేసి 11,530 మందికి అద్దాలు పంపిణీ చేశాం. అలాగే, ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేలా జిల్లాలో 161 పల్లె దవాఖానాలు, తొమ్మిది బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశాం. ఇంకా గర్భస్థ దశలోనే పిండం ఎదుగుదలను గుర్తించేందుకు జిల్లా ప్రధానాస్పత్రిలో టిఫా స్కానింగ్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆధునీకీకరణకు రూ.166 కోట్లు మంజూరయ్యాయి.

దళిత సాధికారితకు దళితబంధు

దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో భాగంగా చింతకాని మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇప్పటివరకు రూ.346.20 కోట్లతో 3,462 యూనిట్లు గ్రౌండింగ్ చేశాం. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 100 యూనిట్ల చొప్పున 483 యూనిట్లను రూ.48.30 కోట్లతో గ్రౌండింగ్ చేశాం.

పారదర్శకత కోసం 'ధరణి'

భూమి రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, ఆస్తుల బదిలీలోపారదర్శకత కోసం 'ధరణి' సైట్‌ను అందుబాటులోకి తీసుకురాగా, 45,667 దరఖాస్తులు స్వీకరించి 38,861 దరఖాస్తులు పరిష్కరించాం. పీఓబీ దరఖాస్తులు ప్రజల నుంచి 14,704, సుమోటోగా 82,403 మొత్తం 97,107 దరఖాస్తులు స్వీకరించగా, ఇందులో 89,059 పరిష్కారమయ్యాయి.

రైతుబంధుతో సాయం

రైతులు పంట పెట్టుబడి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం ద్వారా ఇప్పటివరకు 3,02,057 మంది రైతులకు రూ.295.74 కోట్లు ఖాతాల్లో జమ చేశాం. అలాగే రైతు బీమా ద్వారా 298 క్లయిమ్‌లకు గాను రూ.14.90 కోట్లు నామినీలకు అందించాం. అలాగే జిల్లాలో ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహిస్తుండగా, పశు సంపదకు నిరంతర వైద్య సదుపాయం కల్పిస్తున్నాం. మారుమూల ప్రదేశాల్లో పశువుల చికిత్స కోసం సంచార పశువైద్యశాలలు సమకూర్చాం.

పాఠశాలల బలోపేతం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మన ఊరు - మనబడి / మన బస్తీ - మన బడి కార్యక్రమాన్ని రూపొందించగా, 426 పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. జిల్లాలో రూ.135 కోట్లతో పనులు చేపట్టగా, జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

దుర్గంధం నుంచి ఆహ్లాదం వైపు..

సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులతో చేపట్టిన గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ పనులు చివరి దశకు చేరాయి. గతంలో దుర్గంధం వెదజల్లే ఈ ప్రాంతంలో ఇప్పుడు పార్కులు, ఓపెన్ జిమ్‌లు సిద్ధమవుతున్నాయి.

జాతీయ రహదారులకు మహర్దశ

ఖమ్మం-సూర్యాపేట నాలుగు వరుసల జాతీయ రహదారి 58.626 కి.మీ.కు గాను ఇప్పటికే 57 కి.మీ. మేర పూర్తయింది. ఖమ్మం-కోదాడ నాలుగు వరుసల జాతీయ రహదారి 31కి.మీ.కు ఇప్పటి వరకు 7.99 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. ఇంకా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి, ఖమ్మం-వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు చేపట్టనున్నాం.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమామహేశ్వరరావు, అదనపు కలెక్టర్లు స్నేహ లత, ఎన్.మధుసూదన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, అదనపు డీసీపీ డాక్టర్ శబరీష్, అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాకు నిధులు..

ఈనెల 18న సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. జిల్లాలోని 589 గ్రామపంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున, 10వేల జనాభాకు మించి ఉన్న మేజర్ గ్రామపంచాయతీలకు రూ.10 కోట్ల చొప్పున, కేఎంసీకి రూ.50 కోట్లతోపాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలకు రూ.30 కోట్ల చొప్పున మంజూరు చేశారు. ఖమ్మంకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే రూ.180 కోట్లతో మున్నేరునదిపై కేబుల్ బ్రిడ్జి మంజూరు చేశారు.



జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

పెద్దరికం పేరిట కబ్జా

- రూ.50కోట్ల విలువైన భూమి స్వాహా
- అక్రమార్కుడికి రాజముద్ర వేసిన రెవెన్యూ శాఖ
- ఆపై వెంచర్ ఏర్పాటు.. అనుమతులు లేవన్నా లెక్క చేయని వైనం
- గంగారంలో ఓ అక్రమార్కుడి ఆట



వెంచర్‌కు అనుమతి లేదని గత నెల 27న ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ



గంగారంలోని వివాదాస్పద భూమి ఇదే..

సత్తుపల్లి: సెంట్ భూమి లేదు.. సరైన డాక్యుమెంట్లు లేవు.. అయినా దౌర్జన్యమే పెట్టుబడిగా రూ.కోట్ల విలువైన విలువైన భూమిని పెద్దరికం ముసుగులో కబ్జా చేసిన తీరు విస్తుగొలుపుతోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం అటు వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. రూ.50 కోట్ల విలువైన భూమిని దర్జాగా లాక్కున్న ఈ తంతు సత్తుపల్లి మండలం గంగారంలో వెలుగు చూడగా.. నోరెత్తడానికి స్థానికులు, చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకడుగు వేస్తున్నారంటే సదరు వ్యక్తి ఆగడాలను అర్థం చేసుకోవచ్చు.

సెటిల్‌మెంట్ కోసం వెళ్తే..

గంగారానికి చెందిన సమయమంతుల మల్లికార్జున్ రావుకు ఇద్దరు కుమారులు రామారావు, సాంబశివరావు ఉన్నారు. వ్యాపారంలో లావాదేవీలకు సంబంధించి కొందరికి బాకీ పడడంతో అవి తీర్చేందుకు వీరికి ఉన్న భూమిలో సుమారు మూడున్నర ఎకరాలను కుటుంబ సభ్యులందరి అంగీకారంతో రాసి ఇచ్చేశారు. ఈ సెటిల్‌మెంట్ మొత్తానికి పెద్ద మనిషిగా వ్యవహరించిన వ్యక్తి తీరుతో అంతా సాఫీగా జరిగిపోతుందని వారు భావించారు. కానీ సెటిల్‌మెంట్ చేస్తున్నట్లుగా నమ్మబలికి మల్లికార్జున్ రావు కుటుంబానికి ఉన్న మిగిలిన భూములపై కూడా కన్నేశాడు. అంతేకాక అక్రమంగా డాక్యుమెంట్లతో ఆ భూమిని ఆయన పేరుపైకి బదలాయించుకోవడం వివాదస్పదమైంది.

కోర్టు కేసులో ఉన్నా..

బేతుపల్లి సర్వే నంబరు 133/1, 133/378లోని ఆరు ఎకరాల భూమికి సంబంధించి వివాదం కోర్టులో కొనసాగుతోంది. దీనికి సంబంధించిన నోటీసులు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయానికి కూడా అందాయి. అయినప్పటికీ గంగారంలోని బేతుపల్లి రెవెన్యూ పరిధిలో భూమి విలువ రూ.కోట్లలో ఉండడంతో భూమిపై కన్నేసిన అక్రమార్కుడు వేర్వేరు సర్వే నంబర్లతో డాక్యుమెంట్లు సృష్టించడమే కా... పాస్‌పుస్తకాల్లోని మిగులు భూమి ఉన్న రైతులకు కొంత ముట్టజెప్పి మొత్తం స్థలాన్ని దర్జాగా కబ్జా చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అసలు భూమి ఉన్న సర్వే నంబరుకు బదులు ఇతర సర్వే నంబర్లలోని వేరే సరిహద్దులు ఉన్న మిగులు భూమిని చూపిస్తూ అక్రమాలకు తెగబడినట్టు తెలిసింది. కోర్టు వివాదంలో ఉన్న భూములను ఇతర సర్వేనంబర్లతో స్వాహా చేయగా... సమయమంతుల సాంబశివరావు సతీమణి లక్ష్మీసరిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి..

వివాదాస్పద ఆరు ఎకరాల భూమిని తన పేరిట బదలాయించుకున్న సదరు వ్యక్తి.. ఆ వెంటనే అందులో రియల్ ఎస్టేట్ వెంచర్ చేసి ప్లాట్ల విక్రయానికి సిద్ధమయ్యాడు. దీంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణకు వెళ్లారు. ఈ భూమికి డీటీడీసీ నుంచి కానీ, లే ఔట్‌కు అనుమతి కానీ లేనట్లు గుర్తించారు. దీంతో లే ఔట్‌లోని ప్లాట్లు అమ్మడం, కొన్నడం చట్టరీత్యా నేరమని చెబుతూ గంగారం గ్రామపంచాయతీ ఆధ్వర్యాన గత నెల 27న ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. డాక్యుమెంట్లు, అనుమతి పత్రాలు సమర్పించాలంటూ భూయజమానిగా చెప్పుకుంటున్న వ్యక్తికి నోటీసులు కూడా ఇచ్చారు. అయితే, సదరు వ్యక్తి ఎలాంటి జంకు లేకుండా రెండో రోజు ఫ్లెక్సీని తొలగించాడు. ఇదే విషయాన్ని ఎంపీడీఓ సుభాషిణి దృష్టికి తీసుకెళ్లగా ఫ్లెక్సీ తొలగించిన విషయం తన దృష్టికి రాలేదని చెబుతూ డీటీడీసీ అధికారులు లే ఔట్‌కు అనుమతి తీసుకోవాలని సూచించి వెళ్లారని చెప్పడం గమనార్హం.

భూమి ఉందా, లేదా.. మాకు అవసరం లేదు



భూమి క్రయ, విక్రయాల సమయాన భూమి ఉందా, లేదా అనే అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన పనిలేదు. పాస్‌పుస్తకం ఉంటే చాలు. ఇరుపక్షాలు వచ్చి స్లాట్ బుక్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేస్తాం. మాకు లింక్ డాక్యుమెంట్లు, హద్దులు అవసరం లేదు. బేతుపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 133/1, 133/378 ల్లోని భూమి వివాదాలపై మాకు ఎలాంటి సమాచారం లేదు.

– టి.శ్రీనివాసరావు, తహశీల్దార్, సత్తుపల్లి

ఉత్సాహంగా రామదాసు జయంత్యుత్సవాలు



భజన చేస్తున్న చెన్నైకి చెందిన కళాకారులు

నేలకొండపల్లి: కంచర్ల గోపన్న(భక్త రామదాసు) జయంత్యుత్సవాలు ఆయన జన్మస్థలమైన నేలకొండపల్లిలో గురువారం రెండోరోజుకు చేరాయి. ఈమేరకు చెన్నైలోని పెరంబూరుకు చెందిన కళాకారులు, జిల్లాకు చెందిన చిన్నారులు రామదాసు కీర్తనలతో అలరించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, సర్పంచ్ రాయపూడి నవీన్‌తో పాటు బొడ్డు బొందయ్య, సాధు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, సంచర్ల దేవీప్రసాద్, ఓరుగంటి నారాయణరావు, కడియాల నరేష్, సౌమిత్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దుశ్చర్యలను ఎండగట్టేందుకే యాత్ర

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



మహిళ సమస్యలు తెలుసుకుంటున్న భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: కాంగ్రెస్ శ్రేణులు కలిసికట్టుగా హాత్ సే హాత్ జోడో అభియాస్ యాత్రలో పాల్గొని రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఉద్దేశం, మతం పేరిట లబ్ధి పొందేందుకు బీజేపీ చేస్తున్న దుశ్చర్యలను ఇంటింటా వివరించాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. మండలంలోని మామునూరు గ్రామంలో గురువారం ఆయన హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టారు. తొలుత రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించాక కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం యాత్రలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్న భట్టి.. పాలక ప్రభుత్వాల తీరును వివరించారు. మిర్చి రైతులు ఏర్పాటు చేసిన కల్లంలో కూలీలతో మాట్లాడి మిర్చి దిగుబడి, ధరల వివరాలు ఆరా తీశారు. రైతుల సమస్యలు, గిట్టుబాటు ధరలపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. కాగా, ప్రధాని మోదీ పాలనలో ఆర్థిక అసమానతలు పెరిగిపోగా, దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. అలాగే, ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ లౌకిక వాదాన్ని కాలరాసి మతం పేరిట వైషమ్యాలను పెంచి పోషిస్తోందని తెలిపారు. ఈ యాత్రలో పీసీసీ సభ్యుడు శీలం ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మారాబత్తుల మోహన్‌రావుతో పాటు తల్లపురెడ్డి ప్రవల్లిక, శీలం శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, గంటా తిరుపతమ్మ, కడియం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణరావు, అనుమోలు కృష్ణారావు, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, లింగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాకెవరూ అడ్డు లేరు...

- వైరా రిజర్వాయర్‌లో అక్రమంగా మట్టి తవ్వకం
- రాత్రింబవళ్లు తరలిస్తున్నా కన్నెత్తి చూడని అధికారులు

వైరా/కొణిజర్ల: వైరా రిజర్వాయర్ నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతూ ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. స్థానిక రైతులెవరైనా పొలానికి మట్టి తోలుకుంటామంటే సవాలక్ష ఆంక్షలను బూచిగా చూపే అధికారులు... ఇప్పుడు రాత్రింబవళ్లు మట్టి తవ్వకం, తరలింపు జరుగుతున్నా ఏమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

వందలాది ట్రిప్పులు...

వైరా మున్సిపాలిటీ పరిధి కొణిజర్ల మండలం లాలాపురరంలో కొందరు బడాబాబులు నాలుగు జేసీబీలతో రిజర్వాయర్ శిఖం భూమిలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపట్టి ఇరవైకి పైగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. గత నాలుగు రోజుల పాటు రాత్రి పూట తవ్వకాలు చేపట్టగా గురువారం బరి తెగించి పట్టపగలే తవ్వకాలకు దిగడం గమనార్హం. ఈ నాలుగు రోజుల్లో కలిపి వందలాది ట్రిప్పుల మట్టిని పల్లిపాడు ఏన్కూరు రోడ్డులో ఓ బడా వ్యాపారి ఏర్పాటు చేస్తున్న 12 ఎకరాల వెంచర్‌కు ఈ మట్టి తోలకాలు చేపట్టినట్లు సమాచారం. రిజర్వాయర్‌లో 10 నుంచి 15 అడుగుల వరకు లోతు మేర గుంతలు తవ్వి మట్టి తరలిస్తుండడంతో వర్షాకాలం వీటిలో నీరు చేరి ప్రమాదాలు జరిగే అవకాశముంది. మరోపక్క లాలాపురం నుంచి రేయింబవళ్లు ట్రాక్టర్లు వచ్చివెళ్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ దందా వెనక అధికార పార్టీ ప్రజాప్రతినిధుల హస్తం ఉండడంతోనే అధికారులు పట్టించుకోకపోగా.. చూసీచూడనట్లు వ్యవహరించాలని సిబ్బందికి సూచించినట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం..

వైరా రిజర్వాయర్ నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను పంపించి తవ్వకాలు నిలిపి వేయించాం. శుక్రవారం స్వయంగా పరిశీలించి బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

– శ్రీనివాస్, డీఈ, ఐబీ



వైరా రిజర్వాయర్ శిఖంలో మట్టి తవ్వుతున్న పొక్లెయినర్

ఉత్తములకు ప్రశంసలు

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎంపిక చేసిన అధికారులు, ఉద్యోగులకు గురువారం ప్రశంసాపత్రాలు అందజేశారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు, అదనపు డీసీపీ శబరీష్, అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, అదనపు డీసీపీ శబరీష్



కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరికి ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ గౌతమ్, కమిషనర్ ఆదర్శ్



నర్సింహారావు, తహసీల్దార్ / జి.శ్రీలత, తహసీల్దార్ / వి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ / జి.సుధీర్, నాయిబ్ తహసీల్దార్ / ఎం.లహరి, గిర్దావర్ / బి.రవి, గిర్దావర్ / షేక్ అన్వర్, గిర్దావర్ / ఎ.లక్ష్మి, జూనియర్ అసిస్టెంట్

శ్రీనివాస్, ధరణి కోఆర్డినేటర్ / దుర్గాప్రసాద్, ఈడీఎం / సాయిసందీప్, టైపిస్ట్ / ఎస్.వెంకటరెడ్డి, హెచ్‌డబ్ల్యూఓ / వెంకటాద్రి, ఫైర్‌మెన్ / టి.గోవిందరావు, వార్డర్, జైళ్లశాఖ / కె.శ్రీనివాసరావు, ఏఈ, ఎంబీ ఇంట్రా / సరేందర్, ఏఈ, ఎంబీ ఇంట్రా



డాక్టర్ వి.చైతన్య, హార్టికల్చర్ / కె.హన్మంతరావు, సూపరింటెండెంట్ / అస్లాంఖాన్, జూనియర్ అసిస్టెంట్ / నాగుల్‌మీరా, కంప్యూటర్ ఆపరేటర్ / టి.రవితేజ, సీనియర్ అసిస్టెంట్ / కొండలరావు, స్విమ్మింగ్ కోచ్ / కె.తిరుపతిరావు, హెచ్‌డబ్ల్యూఓ / జి.సంతోష్, టెక్నికల్ అసిస్టెంట్ / షేక్ షమీమ్, ప్రిన్సిపాల్ / సీతారామచంద్ర రావు, డీటీ / ఉమామహేశ్వరి, అకౌంటెంట్ / శ్రీనివాసరావు, మార్కెట్ కార్యదర్శి / పి.రామకృష్ణ, స్టాటిస్టికల్ ఆఫీసర్ / బి.స్రవంతి, జూనియర్ అసిస్టెంట్ / బి.సరిత, అసిస్టెంట్ డైరెక్టర్ / కె.అరవింద్, ఎఫ్ఆర్ఓ / పి.సురేష్‌కుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ / యాదగిరిరావు, సూపరింటెండెంట్ / ఎ.వేణు, హార్టికల్చర్ ఆఫీసర్

ఎస్.లక్ష్మణ్, సర్వేయర్ / జుల్ఫికర్ అహ్మద్, ఎక్సైజ్ సీఐ / ఆర్.సురేందర్, ఎక్సైజ్ కానిస్టేబుల్ / జి.శశికుమార్, ఎక్సైజ్ కానిస్టేబుల్ / ఆర్.కిరీటి, ఎక్సైజ్ సీఐ / కె.శ్రీనివాసరావు, ఎక్సైజ్ కానిస్టేబుల్ / పి.హరీష్, ఎక్సైజ్ కానిస్టేబుల్ / బి.స్రవంతి, సీడీపీఓ / ఎన్.సత్యశీల, సూపర్‌వైజర్ / జి.నరేష్, ఏఈఈ, పీఆర్ / పున్నమి క్రాంతి, ఏఈఈ, పీఆర్ / వెంకటేశ్వరరావు, ఏఈఈ, పీఆర్ / సూర్యనారాయణ, సూపరింటెండెంట్ / వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ / తుమ్మ జగదీష్, 108, ఈఎంటీ / ఎస్.శ్రీనివాస రావు, టైపిస్ట్ / నారాయణరావు, ఆఫీస్ సబార్డినేట్ / వసుంధర, అసిస్టెంట్ సిటీ ప్లానర్ / ఆర్.సంతోష్, టీపీఎస్, కేఎంసీ

ఎ. కృష్ణాలాల్, ఈఈ, కేఎంసీ / టి.ధరణికుమార్, డిప్యూటీ ఈఈ / టి.సతీష్, ఏఈఈ, కేఎంసీ / జి.శ్రీనివాసరావు, ఆర్ఓ, కేఎంసీ / షేక్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ / కె.శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ / జి.ప్రసాద్, దఫేదార్, కేఎంసీ / ఎ.నవీన్‌కుమార్, డిప్యూటీ ఈఈ / కె.వసంత, సీనియర్ అసిస్టెంట్ / బి.నరేష్, డిప్యూటీ ఈఈ / గిరిసింహారావు, మెడికల్ ఆఫీసర్ / బి.శారద, ఎస్‌టీఓ / ఎస్‌కె.రేష్మా, జూనియర్ అసిస్టెంట్ / కిరణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ / శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ / ఎం.స్రవంతి, స్టాఫ్‌నర్స్ / ప్రసాద్, ఫైనాన్స్ మేనేజర్ / వి.విష్ణు, కంప్యూటర్ ఆపరేటర్ / ఎం.సతీష్, సీఓపీఏ

కోటేశ్వరరావు, అడిషనల్ పీపీ / పి.సర్వయ్య, సీఐ, త్రీటౌన్ / ఎం.రవి, ఎస్సై, రఘునాథపాలెం / ఎ.వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ / కె.రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ / ఎం.బాబూరావు, హెడ్ కానిస్టేబుల్ / నాగేశ్వరరావు, కానిస్టేబుల్ / కె.సురేష్, హెడ్ కానిస్టేబుల్ / బి.నాగమణి, కానిస్టేబుల్ / పి.ఆదినారాయణ, కానిస్టేబుల్ / నాగుల్‌మీరా, ఆర్ఎస్సై / పి.నాగరాజు, ఏఆర్ పీసీ / కె.నాగేంద్రరావు, ఏఎస్సై / జి.రాజకుమారి, కో ఆర్డినేటర్ / జి.రూపేందర్, కానిస్టేబుల్, / పి.శ్రీనివాసరావు, హోంగార్డు / డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ / టి.శ్రీనివాస రావు, ఎంపీడీఓ / డి.అశోక్, ఎంపీడీఓ

జి.శ్రీలత, డైరెక్టర్, బీసీ స్టడీ సర్కిల్ / ఎం.వెంకటేశ్వర చారి, ఏడీ / బి.నగేష్, జూనియర్ అసిస్టెంట్ / ఎం.డీ.బషీరుద్దీన్, ఆఫీస్ సబార్డినేట్ / కె.శ్రీనివాసరెడ్డి, ఎంపీఓ / కె.సత్య, సీసీ టూ అడిషనల్ కలెక్టర్ / నరసింహారావు, దఫేదార్ / ఉత్తమ జీపీగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కొమ్మినేపల్లి సర్పంచ్, కార్యదర్శి / లచ్చగూడెం సర్పంచ్, కార్యదర్శి / హర్యాతండా సర్పంచ్, కార్యదర్శి / తెలగవరం సర్పంచ్, కార్యదర్శి / మోటాపురం సర్పంచ్, కార్యదర్శి / బండి వైశాలి, స్పోర్ట్స్ పర్సన్ / బానోత్ విశాలాక్షి, స్పోర్ట్స్ పర్సన్

క్లుప్తంగా

భార్యపై గొడ్డలితో దాడి

చింతకాని: మడల కేంద్రానికి చెందిన వ్యక్తి తన భార్యపై గొడ్డలితో దాడి చేయగా ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. చింతకానికి చెందిన ఎం.రమేష్‌కు మరిపెడకు చెందిన నాగమణితో పదమూడేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే, రమేష్ మద్యం సేవిస్తూ నిత్యం కొడుతుండటంతో ఐదేళ్ల క్రితం ఆమె పుట్టింటికెళ్లింది. అయితే, వారం క్రితం ఆయన బంధువులు మరిపెడ వెళ్లి నాగమణికి నచ్చచెప్పి తీసుకొచ్చారు. కానీ గురువారం ఉదయం మళ్లీ ఆమెను కొట్టడంతో పెద్దమనుషులకు చెప్పి వచ్చింది. ఇంతలోనే సాయంత్రం ఇంట్లో ఆమెపై రమేష్ గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు.

పట్టుబడిన పందెం రాయుళ్లు

కల్లూరు: మండలంలోని పేరువంచ సమీపాన నారాయణపురం రోడ్డు పక్కన గురువారం కోడి పందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.5,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కొండల్‌రావు తెలిపారు. అయితే, ఘటనా స్థలం నుంచి మరో ఎనిమిది మంది పరారయ్యారని పేర్కొన్నారు.

మంటల వేడికి కాలిన విద్యుత్ వైర్

నిలిచిన విద్యుత్ సరఫరా

వైరా రూరల్: వైరా మున్సిపాలిటీ డంపింగ్‌యార్డులో ఏర్పడిన భారీ మంటలతో 11కేవీ విద్యుత్ కేబుల్ వైర్ కాలిపోయి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అప్రమత్తమైన ట్రాన్స్‌కో సిబ్బంది అప్రమత్తం కావడంతో ప్రమాద తీవ్రత తగ్గినట్లయింది. గురువారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు... స్టేజీ పినపాక సమీపంలోని హైలెవల్ వంతెన పక్కన వైరా మున్సిపాలిటీ సిబ్బంది చెత్త పోయగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అయితే, మంటలు ఎగిసిపడడంతో పైన ఉన్న 11కేవీ కరెంట్ తీగలు కరిగిపోయాయి. ఫలితంగా స్టేజీ పినపాక, సిరిపురం, గొండ్లపాలెం, పూసలపాడు, స్నానాల లక్ష్మీపురం, ముసలిమడుగు గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయం తెలియగానే ట్రాన్స్‌కో సిబ్బంది చేరుకోవడమే కాక వైరా అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని మంటలు ఆర్పారు. ఆతర్వాత వైర్లను సరిచేసి రాత్రి వరకు ఆయా గ్రామాల్లో సింగిల్ ఫేస్ సరఫరా పునరుద్ధరించారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వెలుగుమట్ల అటవీపార్క్‌లో మంటలు

అగ్నికి ఆహుతైన వందకు పైగా చెట్లు

ఖమ్మంఅర్బన్: నగరంలోని వెలుగుమట్ల అటవీ పార్క్‌లో గురువారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు వ్యాపించాయి. ఈ మంటల ప్రభావంతో చుట్టుపక్కల ఉన్న వందకు పైగా చెట్లు దగ్ధమయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన అటవీ శాఖ అధికారులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా, వారు చేరుకుని మంటల ను అదుపు చేశారు. ఫారెస్ట్ అధికారి రాధిక, ఉద్యోగులు వేణుమాధవ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

ఖమ్మం అర్బన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న జలవనరుల శాఖ ఇంజనీర్లను ఆ శాఖ సీఈ శంకర్‌నాయక్ గురువారం సన్మానించారు. ఖమ్మంలోని శాఖ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించాక.. విధుల్లో ప్రతిభ కనబరుస్తున్న 15మంది ఇంజనీర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న ఉద్యోగులతో సీఈ

అండగా ఉంటా.. ఆదుకుంటా

- 24 గంటల్లోగా రామకృష్ణకు న్యాయం జరగాలి
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



రామకృష్ణ, ఆయన కుటుంబీకులతో మాట్లాడుతున్న పొంగులేటి

ఖమ్మంఅర్బన్: 'దాడి జరిగి 72 గంటలు కావొస్తున్నా, బాధితుడు రామకృష్ణకు న్యాయం జరగలేదు.. మీపై రాజకీయ ఒత్తిళ్లు ఉంటే పై అధికారులతో మాట్లాడుతా.. ఏదిఏమైనా మరో 24 గంటల్లో రామకృష్ణకు న్యాయం జరకపోతే నేనే స్టేషన్‌కు వస్తా..' అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం అర్బన్ సీఐ రామకృష్ణతో చెప్పారు. మూడు రోజుల క్రితం కొందరి దాడిలో గాయపడిన వైఎస్సార్ కాలనీకి చెందిన రామకృష్ణను గురువారం రాత్రి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన ఇంట్లో పరామర్శించారు. అండగా ఉంటానని, అన్ని విధాల ఆదుకుంటానని పొంగులేటి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన శరీరంపై గాయాలను పరిశీలించి అర్బన్ సీఐతో ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా న్యాయం చేయకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

మానవత్వం చాటుకున్న ముస్లిం దంపతులు

అండగా నిలిచి అనాథ యువతికి వివాహం



హరీషా-రాజు వివాహం జరిపిస్తున్న సలీం దంపతులు

తిరుమలాయపాలెం: మండలంలోని ఓ అనాథ యువతికి అన్నీ తామై ముస్లిం దంపతులు వివాహం జరిపించారు. మండలంలోని గోల్‌తండా గ్రామానికి చెందిన బానోతు లాలు, ఆయన భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. దీంతో వారి కుమార్తె హరీషాను గ్రామానికి చెందిన ముస్లిం దంపతులు షేక్ సలీం, షహనాజ్ అక్కున చేర్చుకున్నారు. ఇటీవల యువతికి ఆలేరుకి చెందిన రాజుతో వివాహం నిశ్చయించి, నర్సంపేట పరిధిలోని నర్సింహాస్వామి దేవాలయంలో గురువారం హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్రాం, మల్లారపు భిక్షం, కానుగంటి యాకయ్య తదితరులు పాల్గొన్నారు. అనాథ యువతిని అక్కున చేర్చుకోవడమే కాక ఆమె మత సంప్రదాయంలోనే వివాహం జరపించిన సలీం – షహనాజ్ దంపతులను పలువురు అభినందించారు.

కొడుకులు పట్టించుకోవడం లేదు..

పోలీసులకు ఫిర్యాదు చేసిన వృద్ధురాలు

ముదిగొండ: ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నా ఆ తల్లి అందరికీ భారమైపోయింది. పెంచి పెద్ద చేసిన తల్లికి పట్టెడన్నం పెట్టకపోవడంతో ఆమె గురువారం ముదిగొండ పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని గోకినేపల్లికి చెందిన తొర్తి వెంకటనర్సమ్మ భర్త కన్నుమూయగా, ఇద్దరు కుమారులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. స్వగ్రామంలో సొంత ఇల్లు ఉన్నా తన బాగోగులు ఎవరూ పట్టించుకోకపోగా, అడిగితే దూషిస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు విచారణ చేపడుతున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు..

ఘనంగా గణతంత్ర దినోత్సవం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఆతర్వాత గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వక్తలు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



కోర్టులో జెండా వందనం చేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు



బీసీ స్టడీ సర్కిల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ శ్రీలత



కేఎంసీలో జెండా వందనం చేస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి, ఉద్యోగులు



జెడ్పీలో జెండా ఆవిష్కరిస్తున్న సీఈఓ అప్పారావు, పక్కన చైర్మన్ కమల్‌రాజ్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి



ఖమ్మం మార్కెట్‌లో జెండా వందనం చేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మీప్రసన్న, ఉద్యోగులు



జెండా ఆవిష్కరిస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఆర్‌టీఓ కిషన్‌రావు



డీసీసీబీలో చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీఈఓ వీరబాబు తదితరులు



విద్యుత్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎస్ఈ సురేందర్



జిల్లా ఆస్పత్రిలో జెండా ఎగురవేసిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో..

బియ్యం మాఫియా జగడం!

నేలకొండపల్లి: ప్రభుత్వం పేదలకు అందించే పీడీఎస్ బియ్యాన్ని మాఫియా ఏర్పడిన కొందరు పక్కదారి పట్టిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంతో దందా యథేచ్ఛగా సాగుతుండగా.. వ్యాపారులు ఘర్షణకు దిగిన ఘటన ఇది. నేలకొండపల్లి, ముదిగొండ మండలాలకు చెందిన పలువురు పల్లెల్లో తిరుగుతూ రూ.10చొప్పున పేదల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.15చొప్పున విక్రయిస్తున్నారు. ఇటీవల నేలకొండపల్లి మండలానికి ముదిగొండ వ్యాపారులు రావొద్దని ఓ వ్యాపారి హుకుం జారీ చేశారు. అయినా ముదిగొండకు చెందిన వ్యాపారి వినకపోగా, రెండు రోజుల క్రితం బియ్యం తీసుకెళ్తుండడంతో నాచేపల్లి వద్ద అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు చేరుకోగా ఘర్షణ జరిగింది. ఈ విషయం వీరికి మద్దతుగా నిలుస్తున్న వారికి తెలియడంతో సర్దిచెప్పినట్లు సమాచారం.

ప్రేమించి పెళ్లి చేసుకుని ముఖం చాటేసిన భర్త

కళ్లకు గంతలతో దీక్షకు దిగిన యువతి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట దీక్ష చేస్తున్న సునీత

కారేపల్లి: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మొఖం చాటేసి వెళ్లిపోయాడు. మరోపక్క అత్త ఇంట్లో ఉండనివ్వకుండా గెంటేసింది. ప్రేమించి పెళ్లి చేసుకుందనే నెపంతో తల్లిదండ్రులు సైతం పుట్టింటికి రానివ్వడం లేదు. దీంతో గత్యంతరం లేక ఆ యువతి కళ్లకు గంతలు కట్టుకుని అంబేడ్కర్ విగ్రహం ఎదుట దీక్షకు దిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని యర్రబోడుకు చెందిన సునీత కారేపల్లిలో చదువుకునే సమయాన కారేపల్లికి చెందిన నాగమణి కుమారుడు సముద్రాల వేణు ప్రేమ పేరిట నమ్మించాడు. ఆతర్వాత ఆయన పెళ్లికి ససేమిరా అనడంతో సునీత వేణు ఇంటి ఎదుట దీక్ష చేపట్టడంతో గత ఏడాది అక్టోబర్ 26న కుల, మహిళా సంఘాల నాయకులు ఒప్పించి ఇద్దరికీ వివాహం జరిపించారు. ఆతర్వాత సునీతను హైదరాబాద్ తీసుకెళ్లిన ఆయన ఆరు నెలల పాటు ఉద్యోగం చేస్తూ జీవించగా, ఇటీవల ఖమ్మం తీసుకొచ్చి వదిలేశాడు. అప్పటి నుంచి వేణు జాడ లేకపోగా, సునీత కారేపల్లిలోని అత్తగారింటికి చేరి ఓ బేకరీలో పనిచేస్తోంది. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తుండగా, ఆమె అత్త నాగమణితో పాటు బంధువులు పలువురు సునీతపై దాడి చేసి బుధవారం బయటకు గెంటేశారు. దీంతో గురువారం ఆమె తనకు న్యాయం చేయాలని కోరుతూ కళ్లకు గంతలు కట్టుకుని అంబేడ్కర్ విగ్రహం ఎదుట దీక్షకు దిగింది. ఈ విషయమై ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ వేణుపై సునీత ఇచ్చిన ఫిర్యాదుతో నమోదు చేసిన కేసు కోర్టులో నడుస్తుండగా, ఇటీవల దాడులపై కూడా కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈమేరకు ఆమెను దీక్ష విరమించి కోర్టు ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని సర్దిచెబుతున్నట్లు చెప్పారు.